క్లుప్తంగా

రేపు సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదిక

తలకొండపల్లి: ఈ నెల 29న సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీకాంత్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో ఈ నెల 12వ తేదీ నుంచి 25 వరకు గ్రామ సభలు నిర్వహించారు. ఈ మేరకు ఈ నెల 29న మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉదయం 10.30గంటలకు బహిరంగ ప్రజావేదిక నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధిహామీ సిబ్బంది, ఉపాధిహామీ కూలీలు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత శాఖల అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

బీజేపీ నాయకుడికి పరామర్శ



రాంరెడ్డిని పరామర్శిస్తున్న ఎంపీ డీకే అరుణ

ఆమనగల్లు: మండల పరిధిలోని మంగళపల్లి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు, ఫిల్మ్ సెన్సార్ బోర్డు మాజీ సభ్యుడు రాంరెడ్డి హృద్రోగ సమస్యతో నగరంలోని అవేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి రాంరెడ్డిని పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఆమనగల్లు: పట్టణంలోని 15వ వార్డు పరిధిలో ఉన్న శివాలయం కాలనీలో రూ.2 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను ఆదివారం మాజీ కౌన్సిలర్ లక్ష్మణ్ ప్రారంభించారు. మున్సిపల్ నిధుల నుంచి కేటాయించిన రూ.2 లక్షలతో ఈ సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు లక్ష్మణ్ వివరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు శ్రీధర్, కృష్ణారెడ్డి, అల్తాఫ్, ఖాదర్, అంజయ్య, శ్రీరాములు, రామకృష్ణ, గౌస్, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ కార్యవర్గం

ఆమనగల్లు: పట్టణ లారీ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో ఆదివారం లారీ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో నూతన అధ్యక్షుడిగా గోపినాయక్, ఉపాధ్యక్షుడిగా జహంగీర్, ప్రధాన కార్యదర్శిగా నరేశ్, కార్యదర్శిగా కృష్ణయ్య, కోశాధికారిగా సలీమ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మల్లేష్, రామస్వామి, అమర్, తిరుపతయ్య, రాములు, నర్సింహ, బాలకిషన్‌సింగ్, షేర్‌ఖాన్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా ర్యాలీ

తుర్కయంజాల్: పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ మున్సిపల్ పరిధిలోని ఇంజాపూర్‌లో హిందూ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సాగర్ రహదారిపై నిరసన తెలిపి.. మృతులకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి రమేష్, కార్యదర్శి పురుషోత్తం, యువ మోర్చ ప్రొటోకాల్ కన్వీనర్ నోముల కార్తీక్ గౌడ్, ఎస్టీ మోర్చా రాష్ట్ర కోశాధికారి ధరావత్ శ్రీనివాస్ నాయక్, సీనియర్ నాయకులు కందాల బల్‌దేవ్ రెడ్డి, తూళ్ల నరసింహ గౌడ్, మల్లెల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కళాశాల వార్షికోత్సవం



మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డికి జ్ఞాపికలు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలో బ్రిలియంట్ ఇంజినీరింగ్ విద్యాసంస్థల ఆవరణలో మూడు రోజుల పాటు నిర్వహించిన కళాశాల వార్షికోత్సవాలు శనివారం రాత్రి ముగిసాయి. బ్రిలియంట్ విద్యాసంస్థల ఛైర్మన్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ముగింపు వేడుకలకు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి హాజరై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. వేదుకల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో బ్రిలియంట్ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ కసిరెడ్డి దుర్గాప్రసాద్ రెడ్డి, కళాశాల యాజమాన్య ప్రతినిధులు రాజిరెడ్డి, రఘోత్తంరెడ్డి, ప్రిన్సిపాల్స్ డాక్టర్ షేక్ రుస్తుం, డాక్టర్ నరేందర్, డాక్టర్ వీరన్న, డాక్టర్ కంట్లమ్, ఏఓలు, హెచ్ఓడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గులాబీ సంబురం

- రజతోత్సవ సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు
- గ్రామాల్లో పార్టీ జెండాల ఆవిష్కరణ

హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి వద్ద నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల నుంచి గులాబీ దళాలు దండుకట్టి కదిలాయి. గ్రామాల్లో పార్టీ జెండాలు ఎగురవేసి బస్సులు, కార్లలో బయలుదేరారు. పలువురు బైక్ ర్యాలీగా బయలుదేరారు. – ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు జోన్ బృందం



అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట నుంచి సభకు వెళ్తున్న వారితో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, క్యామ మల్లేష్, రాంరెడ్డి తదితరులు



కడ్తాల్: బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



కడ్తాల్: వరంగల్ సభకు వెళ్తున్న వాహనాలతో రద్దీ



ఇబ్రహీంపట్నం రూరల్: తులేకలాన్ నుంచి వెళ్తున్న బస్సులో 'సాక్షి'పత్రిక చదువుతున్న కార్యకర్త



ఇబ్రహీంపట్నంలో..



ఇబ్రహీంపట్నం: దండుమైలారంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి సభకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు



యాచారం: నక్కర్తమేడిపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పించి సభకు వెళ్తున్న బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బాషా తదితరులు



ఆమనగల్లు: వరంగల్ సభకు తరలుతున్న నాయకులు



ఇబ్రహీంపట్నం: తుర్కగూడలో జెండా ఆవిష్కరణ



మాడ్గుల: కోల్కులపల్లిలో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరిస్తున్న ధర్మారెడ్డి



తలకొండపల్లి: చంద్రధనలో జెండా ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

యువత చదువు, క్రీడలపై దృష్టి సారించాలి



విజేతలకు బహుమతి అందజేస్తున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, రవీందర్ తదితరులు

- వ్యసనాలకు దూరంగా ఉండాలి
- ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు

యాచారం: యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువు, క్రీడలపై దృష్టి సారించాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. మండల పరిధిలోని మొండిగౌరెల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆదివారం ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ రాజు విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత లక్ష్యాన్ని నిర్దేశించుకు వాటి సాధనకు కృషి చేయాలన్నారు. రూ.లక్షన్నర వరకు ఖర్చుతో పోటీలు నిర్వహించడంపై రవీందర్‌ను ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

యువతకు అండగా ఉంటా: రవీందర్

క్రీడాకారులకు ఎల్లప్పుడు అండగా ఉంటానని బీజే పీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ అన్నారు. మాజీ సర్పంచ్ తాండ్ర లక్ష్మయ్య పేరు మీద ట్రస్ట్ ఏర్పాటు చేసి విరివిగా సేవా కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. కొలన్ మల్లారెడ్డి, ఆదిబట్ల పీఎస్ ఏఎస్ఐ కట్టెల సోమయ్య, ఆర్గనైజర్స్ మధు, ప్రవీణ్, ప్రసాద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయం

- సంఘటితంగా హక్కులను కాపాడుకుందాం
- కాంగ్రెస్ నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం: సంవిధాన్ ర్యాలీలో కాంగ్రెస్ నేత అభిషేక్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా ప్రజలంతా ఏకమై తమ హక్కులను కాపాడుకోవాలని కాంగ్రెస్ నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ ఉపాధ్యక్షుడు మంఖాల దాసు ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ర్యాలీని ఇబ్రహీంపట్నం, తుర్కగూడ, చర్లపటేల్‌గూడ గ్రామాల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేక్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగంలో అణగారిన బడుగు, బలహీన, దళిత, గిరిజనులకు రిజర్వేషన్లను, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో సమాన హక్కులు, వాటాలను పొందుపరిచారన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ఇందిరాగాంధీ తీసుకువచ్చిందని గుర్తు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ, దెబ్బతీస్తోందని మండిపడ్డారు. రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న బీజేపీకి తగిన రీతిలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు ఈసీ శేఖర్‌గౌడ్, వెంకటేశ్వర్లు, మహిపాల్, దాసు, శివకుమార్, గులాం అక్బర్, పాండు, రాఘవేందర్, విష్ణువర్ధన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శ్యామ్ సుందర్, ఆనంద్, నర్సింహ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కుట్రలను తిప్పికొడదాం

ఇబ్రహీంపట్నం రూరల్: రాజ్యాంగాన్ని మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుటిల యత్నాలను రాష్ట్రం ప్రజలు తిప్పి కొట్టాలని కాంగ్రెస్ నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి అన్నారు. ఆదివారం కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేశ్ ఆధ్వర్యంలో తులేకలాన్, కప్పపహాడ్‌లో జైబాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్, పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, రవీందర్, దాసు, బాల శివుడు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుల చేయూత

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్ జెడ్పీహెచ్ఎస్‌లో 1998–1999వ సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు తమ సహాధ్యాయి చెన్నపల్లి గ్రామస్తుడు బురమోని రాజు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఆయన మిత్రులు రూ.50వేలు పోగు చేసి మృతుడి కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఆంజనేయులు, జ్యోతి, మల్లేష్, విఠల్, శేఖర్, శ్రీను పాల్గొన్నారు.

వీధి కుక్కల స్వైరవిహారం



జనం గుండెల్లో భయం

- గాయపడుతున్న ద్విచక్ర వాహనదారులు
- ఎనిమల్ బర్త్ కంట్రోల్ చర్యలు చేపడుతున్నా నెరవేరని లక్ష్యం



వీధి కుక్కను పట్టుకెళ్తున్న బ్లూక్రాస్ సిబ్బంది

తుర్కయంజాల్: మున్సిపల్ పరిధిలో వీధి కుక్కలు వీరంగం సృష్టిస్తున్నాయి. చిన్నా పెద్ద తేడా లేకుండా పరిగెట్టిస్తున్నాయి. బైక్‌లపై వెళ్లే పెద్ద వారిని, సైకిల్‌పై తిరుగుతున్న చిన్నారుల వెంట పడుతున్నాయి. ఈ క్రమంలో వేగంగా వెళ్లేందుకు యత్నించి గాయపడుతున్నారు. ఈ నెల 25న రాగన్నగూడ రాఘవేంద్ర కాలనీలో ఓ వీధి కుక్క ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకులను వెంబడించడంతో వారు వేగంగా వెళ్తున్న క్రమంలో ఓ యువకుడు పైకి ఎగిరి సీసీ రోడ్డుపై గాయపడ్డాడు. ఇదే కాలనీలో వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతూ అటుగా వెళ్తున్న వారిని హడలెత్తిస్తున్నాయి. కుక్కల దాడిలో పలువురు గాయాలపాలవుతున్న మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బ్లూక్రాస్ ఆఫ్ హైదరాబాద్‌తో ఒప్పందం చేసుకుని, ఎనిమల్ బర్త్ కంట్రోల్ కొరకు కుక్కలకు స్టెరిలైజేషన్ చేసి వాటి సంఖ్యను తగ్గిస్తామని మాటలు చెప్పి ఏళ్లు గడుస్తున్నా వాటి సంఖ్య తగ్గకపోగా పెరుగుతూ వస్తోంది. దీంతో మున్సిపల్ పరిధిలో కుక్క కాటు బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది.

రూ.20 లక్షలకు పైగా ఖర్చు

2021 నుంచి ప్రతి ఏడాది అక్టోబర్‌లో బ్లూక్రాస్‌తో, మున్సిపల్ అధికారులు ఎంఓయూ కుదుర్చుకుంటున్నారు. వాక్సినేషన్ చేసి వాటి సంఖ్య పెరగకుండా ఉండేలా స్టెరిలైజేషన్ చేయడానికి ఒక్కో శునకానికి రూ.1,400, రెండు రోజుల పాటు వాటి ఆహారానికి రూ.200 చొప్పున చెల్లిస్తున్నారు. ఇప్పటి వరకు 1,250 కుక్కలకు వాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేసినట్లు సమాచారం. ఈ లెక్కన చూసుకుంటే రూ.20 లక్షల వరకు మున్సిపాలిటీ ఖర్చు చేస్తోంది.

తగ్గని కుక్కల సంఖ్య

మున్సిపల్ అధికారుల లెక్కల ప్రకారం 24 వార్డుల పరిధిలో 800 వరకు మాత్రమే ఉండవచ్చని కుక్కలు చెబుతున్నారు. ఇందుకు భిన్నంగా ఏ గల్లీకి వెళ్లినా పదుల సంఖ్యలో వీధికుక్కలు దర్శనమిస్తున్నాయి. అధికారులు స్టెరిలైజేషన్ చేస్తున్నామని చెబుతుండటంతో వాటి సంఖ్య తగ్గాల్సింది పోయి, రోజు రోజుకు పెరుగుతుండడం అనుమానాలకు తావిస్తోంది. అధికారులు పకడ్బందీగా స్టెరిలైజేషన్ చేయడంతో పాటు, ఇతర ప్రాంతాల నుంచి కుక్కలను తెచ్చి ఇక్కడ వదలకుండా చూడాలని అధికారులను కోరుతున్నారు.

బ్లూక్రాస్‌తో ఒప్పందం

కుక్కల సంఖ్యను తగ్గించేందుకు బ్లూక్రాస్‌తో ఒప్పందం చేసుకుని చర్యలు తీసుకుంటున్నాం. వారంలో రెండు రోజుల పాటు పట్టుకుని వాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేపడుతున్నాం. ఎండాకాలంలో వాటి దాహార్తిని తీర్చేందుకు మే మొదటి వారం నుంచి కాలనీల్లో తొట్లలో నీళ్లను ఏర్పాటు చేస్తాం. – ప్రవీణ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, తుర్కయంజాల్ మున్సిపాలిటీ

డీహైడ్రేషన్‌తో ప్రవర్తనలో మార్పు

కుక్కలు వాటిని ఏమైనా చేస్తారనే భయంతోనే మనుషుల వెంట పడుతాయి. ఆ సమయంలో మనం పరిగెత్తకుండా, అక్కడే ఆగేందుకు యత్నించాలి. దాంతో అది వెనుకడుగు వేసే అవకాశం ఉంటుంది. వేసవిలో నీరు సరిగ్గా దొరక్క అవి డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంటుంది. ఆ సమయంలో వాటి ప్రవర్తనలో మార్పు కనిపిస్తుంది. – నరసింహారావు, వెటర్నరీ డాక్టర్, అబ్దుల్లాపూర్‌మెట్

క్రికెట్ టోర్నీ షురూ

ఇబ్రహీంపట్నం రూరల్: క్రీడలు శారీరక, మానసిక దృఢత్వానికి దోహదపడతాయని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఎల్మినేడు అనుబంధ గ్రామం మెటిల్లాలో యువకులు ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు.



టాస్ వేసి పోటీలు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: ప్రజల సంక్షేమమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన నగరంలోని తన నివాసంలో పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమెల్యే మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. పారదర్శక పాలన అందించేందుకు ప్రభుత్వం అనేక సంస్కరణలను తీసుకువచ్చిందని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి సాహసోపేత నిర్ణయాలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, జవహర్‌లాల్‌నాయక్, హీరాసింగ్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.